నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ముషీరాబాద్, నవంబర్ 25: టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఆజామాబాద్ డివిజన్ 11కేవీ గోల్కొండ ఎక్స్‌రోడ్, స్పెన్సర్, దయార మార్కెట్, శాస్త్రినగర్ ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతు కారణంగా మంగళవారం(నేడు) విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆజామాబాద్ డివిజన్ ఏడీఈ జి.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకు గోల్కొండ ఎక్స్‌రోడ్, స్పెన్సర్ ఫీడర్ పరిధిలోని ఎక్ మీనార్ మసీదు, క్రిష్ణకాలనీ, శివాలయం టెంపుల్, ముషీరాబాద్ పోలీసు స్టేషన్, రాజా డిలక్స్, రేస్ కోర్సు, చర్చి గల్లీ, ఎన్‌బీకే ఎస్టేట్ పరిసరాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు దయార మార్కెట్ ఫీడర్ల పధిలోని రిసాల, సాగర్‌లాల్ ఆసుపత్రి, దయార మార్కెట్, హరిన గర్ ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 5గంటల వరకు శాస్త్రినగర్ ఫీడర్ పరిధి మోహన్‌నగర్, శాస్త్రినగర్, జెమినీ కాలనీ, రాంనగర్, సెయింట్ పాయిస్ హైస్కూల్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదు.

లష్కర్‌లో నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బేగంపేట్, నవంబర్ 25: విద్యుత్ లైన్లలో తలెత్తిన సాంకేతిక లోపాలు, ట్రిమ్మింగ్ కారణంగా నేడు (మంగళవారం) సికింద్రాబాద్ ప్యారడైజ్ ఏఈడీ పరిధిలో ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేసి మరమ్మతు చేపడుతున్నట్టు ఎలక్ట్రిసిటీ అధికారులు తెలిపారు. మోండామార్కెట్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం విధిస్తున్నట్టు చెప్పారు. ధర్మకాంట ఫీడర్ పరిధిలోని ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మానస నర్సింగ్‌హోం, టెలిఫోన్ భవన్ ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తారు. అలాగే గాంధీనగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయత్రం 5 గంటల వరకు వరకు గాంధీనగర్ పీఎస్, బోయిగూడ గార్టెన్స్, సున్నంబట్టి, రైల్వే క్వార్టర్స్, ప్రభుత్వ పాఠశాల ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్టు అధికారులు తెలిపారు.

వైభవంగా కార్తిక మాసం పూజలు

సికింద్రాబాద్‌లోని గణేశ్ టెంపుల్‌లో కార్తిక మాసం చివరి సోమవారం రోజు స్వామి వారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్త జనం తండోపతండాలుగా తరలివచ్చారు. సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించి తమ మొక్కులను తీర్చుకున్నారు. వందలాదిగా దంపతులు తరలివచ్చి ప్రత్యేకంగా పసుపు, కుంకుమ అర్చనలు గావించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారికి కార్తిక దీపాలు వెలిగించారు. గణపతి ఆలయంలో భారీగా భక్తులు తరలివచ్చి సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించడంతో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. ఎటు చూసినా భక్తుల రద్దీ నెలకొంది. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కళకళలాడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయ ప్రాంగంణం కిటకిటలాడింది. ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు.

ఆలయ వార్షికోత్సవం.. అన్నదానం

అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

బొల్లారం, నవంబర్ 25: కంటోన్మెంట్ ఒకటో వార్డు న్యూబోయిన్‌పల్లి దుర్గామాత ఏడు గుళ్ల 37వ వార్షికోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. ఉదయం నుంచే భక్తులు అభిషేకం, చండీ హోమం, లక్షాపుష్పార్చన పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ దాతలు అల్లం కుటుంబ సభ్యులు మహేశ్, విష్ణు ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

30న దివ్యాంగుల మహాధర్నా

సమావేశంలో అధ్యక్షుడు వల్లభనేని ప్రసాద్

చిక్కడపల్లి, నవంబర్ 25: కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపర్చిన దివ్యాంగులకు రూ.6000లకు పింఛన్ అమలు చేయాలని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ డెఫ్ (డీఎస్‌డీ) రాష్ట్ర అధ్యక్షుడు వల్లభనేని ప్రసాద్ డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఇచ్చిన హామీల అమలు కోసం ఈనెల 30 ఇందిపార్క్ ధర్నాచౌక్ వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని సొసైటీ డెఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.భారతి, ఉపాధ్యక్షుడు కె.వెంకటేశ్‌గౌడ్‌తో కలిసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ కూడా అమలు చేయలేదని మండిపడ్డారు. దివ్యాంగులు పెద్ద సంఖ్యలో హాజరై ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కార్మికుల హక్కులను కాపాడుకోవాలి

హిమాయత్‌నగర్,నవంబర్25: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ రంగంలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేసే కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ డిమాండ్ చేశారు. సోమవారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏండ్ల తరబడి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేసే కార్మికులు చాలీచాలని వేతనాలు తీసుకుని జీవనం సాగిస్తున్నారని,వారికి కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా పని చేస్తుందని ఆరోపించారు. కార్మికవర్గం ఐక్యతతో ముందుకు సాగి హక్కులను కాపాడుకోవాలని పిలుపు నిచ్చారు.

వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

బీసీ కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ట్రస్ట్ చైర్మన్ జెరిపేటి సత్యనారాయణ రాజు, వైస్‌చైర్మన్ ఎత్తరి అంతయ్య

చిక్కడపల్లి, నవంబర్ 25: సామాజికంగా అత్యంత వెనుబడిన వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలని వడ్డెర్ల ఆత్మ గౌరవ భవన సముదాయ ట్రస్ట్– తెలంగాణ చైర్మన్ జెరిపేటి సత్యనారాయణ రాజు, వైస్‌చైర్మన్ ఎత్తరి అంతయ్య సోమవారం బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అత్యంత వెనబడిన బీసీ–ఏలో ఉన్న వడ్డెరులను ప్రభుత్వం అసెంబ్లీ తీర్మానం చేసి ఎస్టీ జాబితాలో చేర్చాలని అన్నారు. క్వారీలపై వడ్డెర్లకు పూర్తి హక్కు కల్పించాలని, మైనింగ్‌లో 20 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్లు డాక్టర్ ఓర్సు కృష్ణయ్య, శివరాత్రి అంజయ్య, రాములు, నాగరాజు, శీను తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై నేడు ర్యాలీ

జూబ్లీహిల్స్, నవంబర్ 25: ఓటరు నమోదు ప్రాధాన్యతపై మంగళవారం యూసుఫ్‌గూడ కృష్ణకాంత్ పార్కు నుంచి అవగాహన ర్యాలీ చేపట్టనున్నట్టు యూసీడీ డీపీఓ వెంకటకిషన్ రావు తెలిపారు. 2025, జనవరి 1 నాటికి 18 ఏండ్లు నిండనున్న యువత తమపేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ప్రధానంగా ఉద్యోగ, ఉపాధి నిమి త్తం ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి మారుతున్న వారు చిరునామాలు మార్పు చేయించుకోవాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నూతన ఓటరు జాబితా సిద్ధం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్ఎంసీ 19వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జాకియా సుల్తానా తెలిపారు. ఇందులో భాగంగా అర్హులందరూ తమ పేర్లు ఓటరు జాబితాలో నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈనెలాఖరు వరకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో మొదటి స్థానం

వెయిట్ లిఫ్టింగ్ పోటీలో పాల్గొన్న రేవంత్

సికింద్రాబాద్, నవంబర్ 25: తెలంగాణ రాష్ట్ర స్కూల్ గేమ్స్ పోటీలు అండర్ 17 వెయిట్ లిఫ్టింగ్‌లో సీతాఫల్‌మండి విద్యార్థి రేవంత్‌కు మొదటి స్థానం లభించింది. తెలంగాణ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 17, అండర్ 19 పోటీలు ఆదివారం జింఖానా మైదానంలో నిర్వహించారు. పోటీలలో సుమారు 175 మంది యువ క్రీడాకారులు పాల్గొన్నారు. సికింద్రాబాద్ సీతాఫలమండికి చెందిన జీఎం రేవంత్ 67 విభాగంలో పాల్గొని స్నాచ్ 90 కేజీలు, క్లీన్@ జర్క్ 110, మొత్తం 200 కిలోలు ఎత్తి మొదటి స్థానం కైవసం చేసుకున్నాడు. కాగా జైపూర్‌లోని స్పోర్ట్స్ ఆథారిటీ ఆఫ్ ఇండియాలో వెయిట్ లిఫ్టింగ్‌లో కోచ్ డీడీశర్మ దగ్గర శిక్షణ పొందుతున్నాడు. కార్యక్రమంలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ అధికారులు, హైదరాబాద్ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ సభ్యులు సెక్రెటరీ శ్రీనివాస్, కోచ్‌లు శ్రవణ్, శివకుమార్, రాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్నివర్గాలకు అన్యాయం

మహాధర్నాలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకుడు ముఠా జయసింహ, నాయకులు

చిక్కడపల్లి, నవంబర్ 25: కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్నివర్గాలు ఇబ్బందులు పడుతున్నారని, ఎవ్వరూ కూడా సంతోషంగా లేరని బీఆర్ఎస్ యవ నాయకుడు ముఠా జయసింహ అన్నారు. దళిత, గిరిజనుల పక్షాన బీఆర్ఎస్ పోరాటంలో భాగంగా సోమవారం మానుకోటలో మహాధర్నా నిర్వహించారు. బీఆర్ఎస్ యువ నేత ముఠా జయసింహ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో ధర్నాకు రతలివెళ్లారు. ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లగచర్ల గిరిజన రైతుల పక్షాన ముందుండి పోరాడుతున్నారని చెప్పారు. ఫార్మా పేరుతో ప్రభుత్వం గిరిజనుల భూమి లాక్కోవడానికి ప్రయత్నం చేయడం దారుణమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాకేశ్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, శివముదిరాజ్, శ్రీనివాస్‌యాదవ్, నితిన్, అరుణ్, సాయి చాణిక్యరెడ్డి, సత్యనారాయణ, అనిల్ పాల్గొన్నారు.

విద్యార్థులకు తైక్వాండో బెల్ట్ ప్రదానం

గాంధీనగర్ సమీపంలోని గ్రౌండ్‌లో బెల్టులు అందుకున్న అనంతరం విద్యార్థులు

చిక్కడపల్లి, నవంబర్ 25: తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ హైదరాబాద్ డిస్ట్రిక్ట్, తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ మాస్టర్ బి.కృష్ణ ఆధ్వర్యంలో సోమవారం గాంధీనగర్ కెనరా బ్యాంక్ సమీపంలో ఉన్న గ్రౌండ్స్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు గ్రేడింగ్, కలర్ బెల్ట్స్, సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు మాస్టర్ బి.కృష్ణ, ప్రధాన కార్యదర్శి మీర్ వాహజ్ విద్యార్థులకు అందజేరు. ఈ కార్యక్రమంలో మాస్టర్ సంజయ్, లక్ష్మినారాయణ, కోచ్ మనీష్, స్వామి, రాకేశ్, అనిల్ పాల్గొన్నారు.

నేడు చెక్కుల పంపిణీ

సికింద్రాబాద్, నవంబర్ 25: మధురానగర్ కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో నేడు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావు గౌడ్ పంపిణీ చేస్తారని క్యాంపు కార్యాలయ అధికారులు సోమవారం తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటలకు జరిగే ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేడు మైనార్టీ హక్కుల సాధన సమావేశం

చిక్కడపల్లి, నవంబర్ 25: క్రైస్తవ ప్రజాస్వామ్య ఉద్యమం ఫౌండర్ ఆధ్వర్యంలో మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మైనార్టీ హక్కుల సాధన సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు ఫౌండర్ ప్రెసిడెంట్ పీఏ మొల్కి సేదిక్ పిలుపునిచ్చారు. సమావేశానికి ముఖ్యఅతిథిలుగా పలు పార్టీల నాయకులు హాజరవుతారని చెప్పారు. సీపీఎం నేత అబ్బాస్, సీపీఐ నేత యేసు, ఆంధ్ర క్రిస్టియన్ జియాలజికల్ కాలేజీ ప్రిన్సిపాల్ జి.వరప్రసాద్‌రావు, సోలమాల్ రాజు హాజరవుతారని తెలిపారు.

ఆక్రమణల తొలగింపు

బంజారాహిల్స్: రోడ్‌నం.14లోని నందినగర్ నుంచి బసవతారకం ఆస్పత్రికి వెళ్లేదారిలో వెలిసిన రోడ్డు ఆక్రమణలను ట్రాఫిక్ పోలీసులు 'ఆపరేషన్ రోప్'లో భాగంగా సోమవారం తొలగించారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తడంతో తొలగింపు చేపట్టారు. మరోసారి రోడ్డు ఆక్రమణలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ ఈ సందర్భంగా హెచ్చరించారు.

చెత్త డంపింగ్ యార్డులుగా రోడ్లు

- ఇక్కట్లు పడుతున్న వాహనదారులు
- చోద్యం చూస్తున్న సర్కిల్-15 అధికారులు

జెడ్‌బీ–రాంనగర్ రోడ్డులో చెత్త తరలింపు వాహనాలు నిలపడంతో ఇరుకుగా మారిన రోడ్డు

ముషీరాబాద్, నవంబర్ 25: సర్కిల్–15లో అధికారులు ప్రధాన రోడ్లను ఆక్రమించి చెత్త డంపింగ్ యార్డులు నిర్వహిస్తున్నారు. చిన్నగా మొదలై క్రమంగా రోడ్లను పూర్తిస్థాయిలో ఆక్రమిస్తున్నారు. అధికారులు డంపింగ్ యార్డులు ఎత్తివేస్తుండగా.. ముషీరాబాద్ సర్కిల్‌లో మాత్రం అందు భిన్నంగా ఉన్నది. కొత్తగా డంపింగ్ యార్డుల ఏర్పాటు వ్యవహారం మొదలైంది. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సర్కిల్–15 పరిధిలోని రాంనగర్ జెడ్‌బీ గార్డెన్స్ రోడ్డు, వీఎస్టీ ప్రధాన ద్వారం రోడ్లు చెత్త డంపింగ్ యార్డులుగా మారుతున్నాయి. గార్డెన్ రోడ్డు ఇటీవల పూర్తిస్థాయి డంపింగ్ యార్డుగా మారిపోయింది. గతంలో భారీ వాహనాలు రాకుండా రెండువైపులా గడ్డర్‌లు ఏర్పాటు చేసిన అధికారులు ఇటీవల స్టీలు వంతెన ప్రారంభం కాగానే వాటి తొలగించారు. నేరుగా స్టీలువంతెన దిగిన వాహనదారులు ఎడమ వైపు(రాంనగర్) రావడానికి గార్డెన్ రోడ్డును అశ్రయిస్తుంటారు. దీంతో ఈ రోడ్డు కాస్త ఇటీవల రద్దీగా మారింది. అయితే ఇదే రోడ్డులో చెత్త డంపింగ్ యార్డు నిర్వహిస్తుండటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతుంది. చుట్టు పక్కల చెత్త సేకరించే ఆటో రిక్షాలు ఇక్కడే చెత్త డంపింగ్ చేస్తుండటంతోపాటు భారీ వాహనాలు ఇక్కడే వచ్చి వ్యర్థాలను తరలిస్తుంటాయి. దీంతో ఎప్పుడు చూసినా ఈరోడ్డు చెత్త ఆటో రిక్షాలు, లారీలు, వచ్చిపోయే వాహనాలతో రద్దీగా ఉంటుంది. అంతేకాకుండా పబ్లిక్ కోసం కట్టిన బాత్‌రూంలు సెక్యూరిటీ గార్డు రూంలుగా మారిపోయాయి. దీనికి తోడు వాహనాల అక్రమ పార్కింగ్‌తో ట్రాఫిక్ జామ్‌కు కారణమవుతోంది. స్టీలు వంతెన నిర్మించిన అధికారులు ఎడమ వైపు వెళ్లేందుకు గార్డెన్ వైపు సూచించి చేతులు దులుపుకున్నారు. అయితే ఆ రోడ్డు చెత్త డంపింగ్ యార్డుగా మారండంతో రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఇక వీఎస్టీ ప్రధాన ద్వారం ఎదుగా ఉన్న రోడ్డును ఇటీవల చెత్త డంపింగ్ యార్డుగా మార్చేశారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి చెత్త, నిర్మాణ వ్యర్థాలు తీసుకువచ్చి ఇక్కడ పడవేస్తున్నారు. దీంతో ఈ రోడ్డు కాస్త పూర్తిగా మూసుకుపోయి వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఈ విషయమై సర్కిల్–15 ఏఎంహెచ్ఓ వివరణ కోరే ప్రయత్నం చేయగా ఫోన్‌లో అందుబాటులో రాలేదు.

జేఆర్ఐఎస్ ఇంటిగ్రేటెడ్ స్కాలర్‌షిప్ ప్రారంభం

కార్యక్రమంలో పాల్గొని బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న గోపాల్‌రాజ్, రుద్రకుమార్ శర్మ

బేగంపేట్, నవంబర్ 25: బెంగుళూర్‌కు చెందిన జైన్ ఇంటర్నేషనల్ రెసిడెన్షియల్ స్కూల్(జేఆర్ఐఎస్) ది స్పోర్ట్స్ స్కూల్ సహకారంతో దేశంలో మొదటి ఇంటిగ్రేటెడ్ స్కాలర్‌షిప్ ప్రోగ్రాం ప్రారంభించారు. స్కూల్ సీఓఓ రుద్రకుమార్‌శర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఐబీడీపీ అధిపతి గోపాల్‌రాజ్, ఏపీ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి, పుల్లెల గోపీచంద్, ఆకాడమీ కోచ్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు. 8 మెట్రో నగరాల్లో నిర్వహించే కార్యక్రమాన్ని సోమవారం బేగంపేట్ చిరాన్‌ఫోర్ట్ క్లబ్‌లో నిర్వహించారు. ఆర్థికంగా వెనుకబడిన 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు జేఆర్ఐఎస్‌లో ప్రవేశం కల్పిస్తామని అన్నారు.

PUBLIC NOTICE

General Public is hereby informed that, my client SONATAN MAITY S/o HARDHAN MAITY entered into an Agreement of sale with T.SESHAGIRI S/o S.NAGESHWAR RAO to purchase part and parcel of House bearing No. 23, SCB No. 4-23-003, land admeasuring 57 Sq.yds., comprising of Ground, First, Second and Pent House with a total builtup area of 1600 Sq.fts. Situated at Ram Nagar, Picket, Secunderabad Cantonment, Hyderabad District and paid substantial amount as advance sale consideration. If any person(s) or authorities having any objection, rights, title or whatsoever in respect of said property transaction, may contact the undersigned with supported documents in writing, within 7 days from the date of this public notice and any claims made thereafter will not be entertained and deemed to be waived-off and my clients proceed for registration.

Sd/- **MARRI NARENDER REDDY,**
B.A.B.L(SPL),PG-CYBER LAW,
Advocate
Office:H.No.293,(New No.1-3-316/293), Comsary Bazar, New Bowenpally, Sec-bad Cantonment-11. **Cell: 9394759735**